క్లుప్తంగా

రేపు కోనసీమ వృత్తి కళాకారుల సంఘం సమావేశం

మామిడికుదురు: కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఐదో వార్షికోత్సవం బుధవారం జరుగుతుందని సంఘం వ్యవస్థాపకులు మంగం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, గౌరవాధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియజేశారు. మామిడికుదురు ఉన్నత పాఠశాల రోడ్డులో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఉండ్రు కృష్ణారావు కళావేదిక ప్రాంగణంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో కళాభిమానులు, కళాపోషకులు, కళా ప్రియులు హాజరు కావాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు, ఆచంట రాంబాబు, పుచ్చల తాతారావు, ఉండ్రు శ్రీరామారావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

అంబాజీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్యాధికారి ఎం.వంశీ అన్నారు. ముక్కామలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 104 వాహన వైద్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. హెచ్‌వీ ఎస్.శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ఇ.శివనాగు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

29 మంది వైద్య పరీక్షలు

మామిడికుదురు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం మామిడికుదురులో జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 29 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు.

పళ్లాలమ్మ దేవస్థానం నూతన పాలక మండలి

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం నూతన పాలకమండలిని ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాలకమండలి సభ్యుల పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ప్రభుత్వ ఆమోదం మేరకు దేవదాయ – ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పాలకమండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న, సబ్బితి సత్యనారాయణ, కంచుస్తంభం లక్ష్మి, ఒగ్గు సత్యవతి, కట్టా పద్మ, వానపల్లి శ్రీనివాసరావు, ఇళ్ల రాంబాబు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ఆసాది వడ్లమూరి సత్తిరాజు పాలకమండలి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ పాలకమండలి చైర్మన్‌గా కామిశెట్టి అమ్మన్నను సభ్యులు సమావేశమై లాంఛనంగా ఎన్నుకుంటారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కొత్తపేట: రాష్ట్రంలో టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర పదాధికారి పాలూరి జయప్రకాష్ నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రమోహన్ పిలుపు మేరకు సోమవారం జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో టీచర్ పోస్టులు భర్తీకి వినతిపత్రం సమర్పించారు.మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్, మండల ప్రధాన కార్యదర్శి గ్రంధి నవీన్, సభ్యులు రాజా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్బలా యాత్రకు పయనం



కర్బలా యాత్రికులతో ముస్లిం పెద్దలు

మామిడికుదురు: ఇరాక్, ఇరాన్, సిరియా దేశాల్లోని ముస్లింల పుణ్య క్షేత్రాలను సందర్శించేందుకు 15 మంది సభ్యుల బృందం సోమవారం పయనమైంది. కార్వానే జైనుల్ ఆబేదీన్ ఆధ్వర్యంలో బయలు దేరిన ఈ బృందానికి స్థానిక ముస్లిం పెద్దలు అభినందనలు తెలిపారు. మామిడికుదురు, నగరం గ్రామాలకు చెందిన బృందం సభ్యులు ముందుగా నగరంలోని పంజీషాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పయనమైంది.

వీధి లైట్లు వెలగక ఇబ్బంది

పి.గన్నవరం: గత కొన్ని రోజులుగా గ్రామంలో వీధిలైట్లు వెలగక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వచ్చిన హైఓల్టేజీతో కొన్ని లైన్లలో వీధి లైట్లు పాడైపోయాయి. కారణంగా తాటమ్మవారి గుడి, టెలిఫోన్ ఎక్చేంజి, శివాలయం వీధుల్లో లైట్లు వెలగడంలేదు. ఈవీధుల్లో కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో కుక్కలు వీర విహారం చేస్తున్నాయి. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ సమస్యను గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పాతవి మార్చి కొత్త లైట్లు వెలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

రామచంద్రపురం రూరల్: తాళ్లపాలెంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కట్టా గోవిందు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ చిన్నబ్బాయి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- పంట ఒబ్బిడిలో రైతులు
- పొలాల్లో పర్యటిస్తున్న అధికారులు



మొసలపల్లిలో తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



ఇరుసుమండలో ఆరబెడుతున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అంబాజీపేట: గత రెండు రోజులుగా ఉదయం కురిసిన భారీ వర్షానికి వరి, పోకకాయల రైతులు బెంబేలెత్తిపోయారు. వర్షానికి పంట తడిసిపోవడంతో ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో గంగలకుర్రు, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, చిరతపూడి, ఇసుకపూడి, మొసలపల్లి గ్రామాల్లో వరికోత యంత్రాలతో మాసూళ్లు జరుగుతున్నాయి. ఎండలు ఉండడంతో కళ్లాలోనే ధాన్యం రాశులను ఉంచి ఆరబెడుతున్నారు. మిగిలిన గ్రామాల్లో దాళ్వా పంట పక్వానికి వచ్చింది. అకాల వర్షంతో ఆరుబయట ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. అంబాజీపేటలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పోక కాయలను కళ్లల్లో వేయడంతో తడిసిపోయాయి. సుమారు 40 రోజుల పాటు ఎండబెట్టిన పోక కాయలను నుంచి గుడ్లను వేరు చేసి పిక్కను తయారు చేస్తారు. అకాల వర్షం కారణంగా రూ.10 లక్షల విలువైన పోక కాయలు తడిసిపోయాయని దొమ్మేటి అశోక్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

వరికోతలు వాయిదా వేయండి

అంబాజీపేట: వాతావరణంలో మార్పుల కారణంగా వరి కోతలు వాయిదా వేయాలని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజులు రైతులకు సూచించారు. ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు, మొసలపల్లి, గంగలకుర్రు గ్రామాల్లోని వరి చేలను సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలో 3024 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం 220 ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేశారన్నారు. 15 ఎకరాల్లో పనలుపై ఉందన్నారు. 48 ఎకరాల్లో వరి రాశులు ఉన్నాయన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలతో కప్పి, వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలన్నారు. ధాన్యం తడిస్తే ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకుని ఆరబెట్టుకుంటే మొలక రాదని, రంగుమారదని రైతులకు వివరించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మామిడికుదురు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ నేతలు సోమవారం తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం ఇచ్చారు. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, బైరిశెట్టి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, యేడిద బాబులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

సఖినేటిపల్లి: గ్రామాల్లో భారీ వర్షానికి దెబ్బతిన్న వరి చేలను మండల స్థాయి అధికారుల బృందం పరిశీలించింది. కోతలు పూర్తయి పన మీద ఉన్న వరి చేలను, కళ్లాల్లో ఉన్న వరిని వారు పరిశీలించారు. రామేశ్వరంలోని పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ పనులను తహసీల్దారు వై.రామ కుమారి, ఎంపీడీవో జీ.భీమారావు, ఏవో పీవీ నరసింహారావు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికలు



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజోలు: ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు తాటిపాకలోని టీసీఎస్ఎం క్లబ్‌లో సోమవారం ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరం, రావులపాలెం, అమలాపురం, తుని, రాజోలు తదితర ప్రాంతాల నుంచి సుమారు 70 మంది బాక్సింగ్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో సీహెచ్‌డీ మనోహర్, సీహెచ్ అఖిల్‌కుమార్, సీహెచ్ పృధ్వీరాజ్, జె.సందీప్, పి.దుర్గారావు, కె.కిషోర్, షేక్ షాముద్దీన్, యు.లోవరాజు, పి.వి.వి.ఎస్.డి. మహేష్, ఆర్.మధు, వి.ఎస్.శివకిరణ్, మహిళా విభాగంలో వై.దివ్యరాణి, కె.రాజీ, టి.నాగలక్ష్మి, కె.రాణి, జి.దుర్గావీరలక్ష్మి, ఎస్.కె.నస్రీన్, జి.వెంకటలక్ష్మి, ఆర్.సంధ్య ఎంపికయ్యారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్, బి.మధుకుమార్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చంద్రశేఖర్ తెలిపారు.

సామాజిక తనిఖీపై శిక్షణ



హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మలికిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంఈవో ఎం.విజయశ్రీ అధ్యక్షతన మలికిపురం, రాజోలు మండలాల్లోని హెచ్‌ఎంలకు పాఠశాల సామాజిక తనిఖీపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్ సీహెచ్.వి.నందం, ఎం.వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన హెచ్‌ఎంలు ఆయా పాఠశాలల వారీగా స్కూల్ పేరెంట్స్ కమిటీలకు శిక్షణ ఇస్తారన్నారు. కాగా జిల్లా సమగ్ర శిక్షణ అధికారి బీవీ సుబ్రహ్మణ్యం పాఠశాల సామాజిక తనిఖీ కార్యక్రమం గురించి వివరించారు. స్టాఫ్ ఆర్.శేఖర్, ఆర్.రవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీవో ఎం. ముక్కంటి పరిశీలించారు. సిబ్బందిని ధాన్యం కొనుగోలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొనుగోలు ఆదేశించారు. అనంతరం ఆత్రేయపురం గ్రామంలో అకాల వర్షాలకు తడిచిన ధాన్యం రాశులను పరిశీలించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్లి ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు దుగ్గిరాల వెంకట నాగ అనిల్‌కుమార్, ఆర్ఐ భవానీ వీఆర్ఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

వేధింపులకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలి



లూటుకుర్రు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలో ఆశ వర్కర్‌ను వేధింపులకు గురి చేసిన ఏఎన్ఎంతోపాటు ఎంఎల్ హెచ్‌పీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు సోమవారం ధర్నా చేశారు. లూటుకుర్రు పీహెచ్‌సీ మెట్లపై నిల్చుని ఉద్యోగులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల ఆశ వర్కర్లపై వేధింపులు అధికమయ్యాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వేధింపులతో ఆదుర్రు గ్రామంలోని ఆశ వర్కరుగా పని చేస్తున్న గుర్రం ధనలక్ష్మి అనారోగ్యానికి గురైందన్నారు. ఆమెను పని ఒత్తిడితో తీవ్రంగా వేధించడం వల్ల ఆస్పత్రి పాలయ్యిందన్నారు. ఉమ్మడి జిల్లా ఆశ వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలు ఎస్తేరురాణి, కోశాధికారి కె.సూర్యావతి, ఉమామహేశ్వరి, లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని ఆశ వర్కర్లు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణానికి రాట ముహూర్త పూజలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో గౌతమి గోదావరి ఒడ్డున కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. యాగశాల నిర్మాణానికి సోమవారం రాట ముహూర్త పూజలు చేశారు. పీటలపై కూర్చున్న సుంకర శ్రీనివాస్, లక్ష్మీ దుర్గ దంపతులచే వేద పండితుడు పెదపూడి సీతారామం ఆధ్వర్యంలో పండితులు పూజలు చేయించారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ మే 9 నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ పూజలు కొనసాగుతాయన్నారు. 11న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

జగన్‌తో గ్రామ స్వరాజ్యం సాకారం

- ఎంపీపీ గంగాధరరావు
- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులు అందుకున్న సర్పంచులు తదితరులు



ఉత్తమ అవార్డులు అందుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తపేట: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సాకారమైందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్ముని విగ్రహానికి ఎంపీపీ గంగాధరరావు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అనే నినాదాన్ని, మహాత్ముని ఆశయాలను నిజం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా పాలన అందిస్తున్నారన్నారు. పంచాయతీల పరిధిలో సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ప్రజల ఇంటి ముంగిటకే తెచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఇదే గాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యమని వివరించారు. ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, నేలపూడి భీమరాజు, షేక్ బడేమియా, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, మండల పరిషత్ ఏఓ కృష్ణారెడ్డి, ఎస్ఏ శశికుమార్, సీఓ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌కు విశేష అధికారాలు

అంబాజీపేట: స్థానిక సంస్థలకు విశేష అధికారాలను 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కట్టబెట్టిన సందర్భంగా దేశ వ్యాప్తంగా పంచాయతీ రాజ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవతి అన్నారు. వక్కలంక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ రేవతి, ఎంపీటీసీ సత్యవతి మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రారంభించారన్నారు. దీని వల్ల గ్రామ పంచాయతీలకు సర్వ హక్కులు లభించి అభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు అవార్డులు

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఎనిమిది మంది సర్పంచ్‌లు అవార్డులు అందుకున్నారు. వీరిలో గొంది, రామేశ్వరం సర్పంచ్‌లు దొండపాటి రవికుమార్, కట్టా ఉమామహేశ్వరరావులకు ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ-2 రుద్రరాజు చినరాజా సత్కరించారు. ఎంపీడీవో జీ.భీమారావు, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఏవో పీవీ నరసింహరావు, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజోలు మండలంలో...

రాజోలు: మండలంలోని రాజోలు, శివకోడు, బి.సావరం, పొదలాడ, మెరకపాలెం, కడలి, పొన్నమండ, కాట్రేనిపాడు గ్రామాలకు ఉత్తమ అవార్డులు అందాయి. తొమ్మిది విభాగాల్లో వచ్చిన ఉత్తమ అవార్డులను ఆయా సర్పంచులు, కార్యదర్శులు అందుకున్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, చొప్పల గుణనాథ్, అడబాల శ్రీనివాసరావు, కడియం రమాదేవి, కుక్కల బేబికుమారి, కడలి సత్యనారాయణ, గిడుగు వెంకట నారాయణప్రసాద్‌లను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఏఓ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి మండలంలో..

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాడి వెంకటాచార్య ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పలు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ఉత్తమ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు వార జయసావిత్రి, కుసుమ లిల్లీ మంగేష్కర్, సలాది బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం మండలంలో

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నాతిబుజ్జి, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబా ప్రసంగించారు. మండల పరిధిలోని ఉత్తమ ప్రతిభ అందుకున్న తాడిపూడి, మెర్లపాలెం, ర్యాలి, కట్టుంగ, నార్కెడ్‌మిల్లి, ఉచ్చిలి పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులను ఘనంగా సన్మానించి పురస్కారాలు, బహుమతులు అందజేశారు. ఉత్తమ పురష్కారాలు అందుకున్న సర్పంచ్‌లు ముదునూరి సుబ్బలక్ష్మి, కొండమంచిలి లక్ష్మి, పాలా నాగేశ్వరరావు, మెర్ల శ్రీరామ చంద్రమూర్తి, కరుటూరి బ్రహ్మాజీ, ఉద్రింకల మీరమ్మతో పాటు కార్యదర్శులను సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగ్రరాజు, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు, వేముల శ్రీనివాస్, కాయల జగన్నాథం, ఎంపీటీసీలు పాల వెంకటరమణ, వేముల వెంకన్నబాబు, తూము కాశీ విశ్వనాథం, మట్టాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో గాంధీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

మలికిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్ ఎంపీపీ కె.నిర్మల అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేశ నిర్మాణంలో పంచాయతీరాజ్ ప్రముఖ పాత్ర వహిస్తుందని ఎంపీడీవో వి.బాబ్జీరాజు అన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పంచాయతీల సర్పంచ్‌లకు మెమెంటోలను బహూకరించారు. పరిపాలన అధికారి జీ.మిల్టన్, అడ్మినిస్ట్రేషన్ అధికారి బి.మంగాదేవి పాల్గొన్నారు.

మామిడికుదురు పంచాయతీకి 9 అవార్డులు



కలెక్టర్ శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మొహిద్దీన్

మామిడికుదురు: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మామిడికుదురు సర్పంచ్ గోస్ మొహిద్దీన్‌కు కలెక్టర్ హిమాన్షు శుక్లా పతకం, షీల్డు, ప్రశంసాపత్రం అందజేశారు. మామిడికుదురు పంచాయతీకి వివిధ విభాగాల్లో తొమ్మిది అవార్డులు వచ్చాయి. కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్‌కు కూడా పతకం, షీల్డు, ప్రశంసాపత్రం అందించారు. ముందుగా గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో పలువురు సర్పంచ్ మొహిద్దీన్‌తో పాటు కార్యదర్శి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీ నయినాల సీతామహాలక్ష్మి, స్థానికులు నయినాల సత్యమూర్తి, కలిగితి పళ్లంరాజు, నల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరావులమ్మకు బూరెల సారె



సారెను ఊరేగిస్తున్న భక్తులు

ఆలమూరు: సంధిపూడిలో ఉన్న శ్రీరావులమ్మ అమ్మవారికి బూరెల (పోలి) సారె సమర్పణ జరిగింది. అమ్మవారి తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు సుమారు పది వేల బూరెలను అమ్మవారికి సారెగా నైవేద్యంగా సమర్పించారు. తొలుత మహిళలు బూరెలు నింపిన బిందెలతో అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారిని భక్తులకు పంపిణీ చేశారు. శ్రీరావులమ్మ అమ్మవారి వార్షిక వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నసమారాధన జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు ఐదు వేల మందికి పిండివంటలతో అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

నరసన్న సన్నిధిలో రామానుజుల వర్ష తిరు నక్షత్ర పూజలు



స్వామివారి చెంతన రామానుజుల వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం రామానుజుల వర్ష తిరు నక్షత్రం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి భక్తుడైన రామానుజులను స్వామివారి చెంతన ఆశీనులు చేశారు. తొలుత లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుడు రామానుజులవారికి కూడా పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఈ పూజలు చేస్తామని రంగాచార్యులు అన్నారు.

పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

మలికిపురం: స్థానిక శ్రీవాణీ గ్లోబెల్ స్కూల్‌లో సోమవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఐ.పావని మాట్లాడుతూ విద్యార్థులలో వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడుతుంది అన్నారు. కాగా ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు సమకూర్చిన డబ్బులతో ఆక్సిజన్ సిలెండర్‌ని కొనుగోలు చేసి, వృద్ధాశ్రమానికి బహూకరించనున్నట్టు పావని తెలిపారు.

అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

అయినవిల్లి: స్థానిక చినపేటలో అంబేడ్కర్ జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు హాజరైయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



క్రాంతికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం

రాజోలు: అనారోగ్యానికి గురైన దివ్యాంగ బాలుడు తెన్నేటి క్రాంతి వైద్యం కోసం సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. రాజోలు తెన్నేటి నగర్‌కు చెందిన క్రాంతికి బెస్సీస్ లిటిల్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆర్థిక సాయాన్ని సమకూర్చి అందించింది. సర్పంచ్ రేవు జ్యోతి, అడిషనల్ ఎస్సై కె.ప్రసాద్, పమ్మి రత్నకుమారి, తాడి సహదేవ్, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ వాహనాల వేలం

ఆలమూరు: మద్యం అక్రమ రవాణాలో పట్టుకున్న వాహనాలకు ఈనెల 26న వేలం వేయనున్నట్టు ఆలమూరు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.అరుణమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆసక్తి కలిగిన, అర్హులైన కక్ష్యిదారులు ఎస్ఈబీ నిర్దేశించిన రూ.రెండు వేల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు స్థానిక సిద్ధార్థ హైస్కూల్ సమీపంలో ఉన్న ఎస్ఈబీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నేడు దేవస్థానం భూమి కౌలు హక్కుల వేలం

కాజులూరు: గొల్లపాలెంలో పురాణ ప్రసిద్ధి గాంచిన బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.75 ఎకరాల సాగు భూమి కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు వీఆర్వో ఈశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో మూడేళ్ల కాలపరిమితికి గాను వేలం జరుగుతుందని. ఆసక్తి ఉన్న రైతులు రూ.30 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునన్నారు.